క్లుప్తంగా

నరసింహస్వామి ఆలయంలో వేడుకలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న వినాయక నరసింహస్వామి ఆలయంలో సోమవారం చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులకు అవసరమైన వసతులు కల్పించినట్లు అన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి


విగ్రహాల ఏర్పాటుపై సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ

నింద్ర: వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేవారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక విగ్రహాల ఏర్పాటుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేస్తే మూడురోజులలోపు నిమజ్జనం చేయాలని స్పీకర్లు, డ్యాన్స్ ఇతరత్రా వాటిని ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. సమావేశంలో పలువురు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీదేవి వేడుకలు


అలంకరణలో ద్రౌపదీదేవి

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో ద్రౌపదీదేవి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సప్తకన్నికలకు విశేష పూజలు



పుత్తూరు రూరల్: పుత్తూరు చెరువు సమీపంలో వెలసిన సప్తకన్నికల ఆలయంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఏడుగురు అక్కచెల్లెళ్లు కన్నికాదేవతలైన బ్రహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండీ గ్రామాన్ని సదా రక్షిస్తుంటారని ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఏటా గంగ జాతర అనంతరం వచ్చే ఆదివారం రోజున సప్తకన్నికలకు అభిషేకార్చనలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం అభిషేకానంతరం ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం దీపారాధన చేపట్టారు.

సంతమైదానం శుభ్రం


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నగరి: మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్, భారత్ స్వచ్ఛతా లీగ్ -2.0 భాగంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఆదివారం సంతమైదానాన్ని శుభ్రం చేశారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఈ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువగా చెత్త చేరే ప్రాంతాల్లో ఈ స్వచ్ఛత పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందరూ నిబద్ధతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.పురుషోత్తం, వార్డు పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



పుత్తూరు రూరల్: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం స్థానిక బీజేపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఈశ్వరాలయంలో మోదీ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కె.బాబు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథాన పయనిస్తోందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎం.సుబ్రమణ్యం, హరిబాబు, వేఖర్, భక్తవత్సలం, హరి తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి పూజకు వేళాయె..!

- నియోజకవర్గవ్యాప్తంగా చవితి నిర్వహణకు సర్వం సిద్ధం
- రెండు రోజుల పాటు చవితి గడియలు
- నేడు పండుగ చేసుకోవడానికి మొగ్గు చూపుతున్న జనం
- జోరుగా పూజా సామగ్రి విక్రయాలు
- మట్టి వినాయకులనే వినియోగించాలని మంత్రి రోజా పిలుపు

నగరి: గణనాథుని పూజకు వేళ అయింది. వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ ఏడాది చవితి గడియలు రెండురోజుల పాటు వచ్చాయి. సోమవారం ఉదయం 10.04 నుంచి ప్రారంభమై మంగళవారం ఉదయం 10.32 వరకు చవితి ఉంటుందని పంచాంగాలు చెబుతున్నాయి. దీంతో వినాయక చవితి జరుపుకోవడంపై కొంత సందేహాలు వెలువడిన నేపథ్యంలో రాత్రి గడియలు ఎక్కువగా ఉన్నందున సోమ వారమే చవితి జరుపుకోవాలని అర్చకులు, పురోహితులు, వేదపండితులు స్థానికంగా సూచించడం, తమిళ క్యాలెండర్ల ప్రకారం చవితి సోమవారమే ఉండడంతో తమిళులు ఎక్కువగా ఉన్న ప్రాంతం అయినందున పలువురు సోమవారమే వినాయకచవితి జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో చవితి రోజున మట్టితో చేసిన వినాయక ప్రతిమను తెచ్చి పూజలు చేసి నీటిలో నిమజ్జనం చేస్తే ఆ విగ్రహం కరిగిపోయినట్లుగా విఘ్నాలు కూడా తొలగిపోతాయన్నది ప్రతీతి. దీంతో వీధికో బొజ్జ గణపయ్యను స్థానికులు ఏర్పాటు చేసుకుంటున్నారు. రాత్రిపూట శిబిరాలు విద్యుత్ దీపాలతో కళకళలాడే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ పండుగను నగరి, పుత్తూరు పట్టణాల్లో 3 రోజుల నుంచి 7 రోజుల పాటు నిర్వహిస్తారు. ఇప్పటికే ట్రాక్టర్లలో, బైకుల్లో గణేశుని ప్రతిమలను యువకులు తరలిస్తున్నారు. పర్యావరణానికి సురక్షితమైన మట్టి వినాయక ప్రతిమలకు డిమాండ్ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాల తయారీదారులు మట్టి వినాయక ప్రతిమలను, మట్టితో చేసిన రంగుల వినాయక ప్రతిమలను విక్రయాలకు ఉంచారు. మట్టితో సుందరంగా తయారు చేసిన కోల్‌కతా వినాయకుని ప్రతిమలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గణనాథుని పూజకు అవసరమైన పండ్లు, పూలు, ఇతర సామగ్రికి డిమాండ్ ఏర్పడడంతో ధరలు ఊపందుకున్నాయి.

సంప్రదాయరీతిలో పూజలు..

ఇంటి వద్దే గణనాథుని ప్రతిమ ఉంచి పూజ చేయడంలో నగరి ప్రాంత ప్రజలు పలు సంప్రదాయాలను పాటిస్తారు. ఆనవాయితీ ప్రకారం కొందరు మట్టితో తయారుచేసి విక్రయించే ప్రతిమలను కొనుగోలు చేసి పూజిస్తే కొందరు అచ్చు వేసి తయారుచేసే వినాయక ప్రతిమలను వాడుతారు. కొందరు రంగుల వినాయక ప్రతిమను ఉపయోగిస్తే కొందరు స్వయంగా మట్టి తీసుకువచ్చి ఇంటి వద్దే వినాయకుని ప్రతిమను తయారు చేసుకుని పూజించే ఆచారాన్ని పాటిస్తారు. ఇంకొందరు వినాయక ప్రతిమలను కొనుగోలు చేయక ఇళ్లలోని వినాయకుని ప్రతిమకే పూజలు జరుపుతారు. అదేవిధంగా నిమజ్జనంలో పలు పద్ధతులు పాటిస్తారు. కొందరు చవితి రోజు సాయంత్రమే గణుశున్ని నిమజ్జనం చేస్తే, కొందరు మూడవ రోజు, కొందరు తొమ్మిదవ రోజు నిమజ్జనం చేస్తారు. కొందరు ఈ ఏడాది పూజలు అందుకున్న వినాయకుని ప్రతిమను ఇంటిలోనే ఒక ప్రాంతంలో భద్రంగా ఉంచి, వచ్చే ఏడాది నిమజ్జనం చేస్తారు. ఇలా ఆచారానికి తగిన విధంగా విగ్రహాలు, పూజాసామగ్రి కొనుగోళ్లలో జనం నిమగ్నమయ్యారు.

వినాయక చతుర్థికి ఏర్పాట్లు

వెదురుకుప్పం: వినాయక చదుర్థిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. ఈసందర్భంగా గ్రామాల్లో యువకులు పెద్దఎత్తున వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా వెదురుకుప్పం, పచ్చికాపల్లం, పాతగుంట, దేవళంపేట, మొరవ, మాంబేడు, జక్కిదొన ప్రాంతాల్లో వినాయక ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్దఎత్తున పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే యువత వినాయక విగ్రహాలను తీసుకొచ్చి పూజలు చేసేందుకు అలంకరిస్తున్నారు.

మట్టి గణపయ్యనే పూజిద్దాం

పాలసముద్రం: వినాయక చవతిని పురస్కరించుకుని మండల పరిసర గ్రామాల్లో మంగళవారం యువత మండపాల ఏర్పాట్లను నిమగ్నమయ్యారు. జీవకోటికి ఆధారమైన పర్యావరణాన్ని పరిరక్షించాలని ఏఎస్‌ఐ రెడ్డెప్ప అన్నారు. మట్టి వినాయక విగ్రహాలను వాడడం ద్వారా ప్లాస్టిక్ ఆఫ్ ప్యారిస్‌ను నిషేధించవచ్చన్నారు. అనంతరం వినాయక విగ్రహాల ప్రతిష్ఠకు అనుమతి తప్పకుండా ఉండాలని తెలిపారు.

మట్టి గణపతినే పూజిద్దాం


మట్టిగణపతితో మంత్రి ఆర్‌కే రోజా

తొలి పండుగైన వినాయక చవితిరోజున మట్టి గణపతిని పూజించి సురక్షితంగా వినాయక చవితిని ఇళ్ల వద్దే జరుపుకుందాం అని మంత్రి ఆర్‌కే రోజా ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కనబెట్టి, పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వివిధ రకాల రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల ఏర్పడిన కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. మన భక్తి వల్ల మరొకరికి ముప్పు వాటిల్లడం మంచిది కాన్న విషయాన్ని అర్థం చేసుకుంటే చాలని మట్టి గణపతి కోసం గట్టి సంకల్పం తీసుకోవచ్చన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, అందమైన సమాజాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన పండగల పరమార్థం ఇదే అన్నారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ముఖ్యమంత్రి సీఎం జగనన్న ప్రజలకు అండగా ఉన్నారని ఈ తరుణంలో అందరూ ఆనందంగా వినాయకచవితిని జరుపుకుంటారని ఆశిస్తున్నానని తెలిపారు.


నగరి పట్టణంలో పూజాసామగ్రిని విక్రయిస్తున్న వ్యాపారులు






అచ్చు వేసి గణేశుని విగ్రహాలు సిద్ధం చేస్తున్న తయారీదారులు, విక్రయానికి ఉంచిన కలకత్తా మట్టి విగ్రహాలు, బస్టాండ్ ప్రాంగణంలో పూజా సామగ్రి విక్రయాలు, వినాయక మండపాలకు గణనాథుని ప్రతిమలు తీసుకెళ్తున్న యువకులు, మట్టితో చేసిన గణేశ్ ప్రతిమలు

నవరత్నాలే ప్రజల జీవనాడి

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: సంక్షేమం, అభివృద్ధి సీఎం జగనన్నకు రెండు కళ్లు అని, నవరత్నాల పథకాలు ప్రజలకు జీవనాడి లాంటివని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆదివారం ఆయన సీడీ కండ్రిగ సచివాలయ పరిధిలోని కోదండరామాపురం, కోదండరామాపురం దళితవాడ, సీడీ కండ్రిగ, ఎగువరాజుల కండ్రిగ, వడ్డిండ్లు, టీకేఎం పేట, రాజుల కండ్రిగ గ్రామాల్లో సర్పంచులు ఆకుల మంగమ్మ, గోవిందమ్మ, ఎంపీటీసీ నందిని ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇంటి వద్దకే పథకాలు..

ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు డిప్యూటీ సీఎం నారాయణస్వామితో మాట్లాడుతూ గతంలో తమకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందేవి కావని, సమస్యలు పరిష్కరించాలని అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. సీఎం జగనన్న ప్రభుత్వం వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పథకాలు తమ ఇళ్ల ముంగిటకే వచ్చి చేరుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్నను ఓడించేందుకు రాబందులన్నీ ఒకటయ్యాయని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. టీడీపీ, జనసేన నేతలు అవినీతి డబ్బులతో ప్రజలను కొనేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ప్రస్తుతం జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలన అందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ప్రతి సామాజిక వర్గం కూడా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందలన్నాదే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం జగనన్న విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశ పెట్టారని వెల్లడించారు. మహిళా రక్షణకు దిశ చట్టంతో భరోసా కల్పించారన్నారు. టీడీపీ నేతలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేశారని విమర్శించారు.

సమస్యలు.. పరిష్కార మార్గాలు..

అనంతరం మెదవాడ ఎస్టీ కాలనీ వాసులు డిప్యూటీ సీఎంకు పలు సమస్యలు విన్నవించారు. తమకు ఇంటి స్థలం లేదని, రోడ్డు పక్కన పూరిగుడిసెలో నివసిస్తున్నామని, ఇంటి స్థలంతో పాటు గ్రామానికి శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇల్లు లేని వారికి పట్టా ఇచ్చి, ఇల్లు మంజూరు చేయాలని, శ్మశానానికి స్థలం గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో డ్రైనేజీ సమస్య ఎక్కువ ఉందని సమస్యను పరిష్కరించాలని టీకేఎం పేట గ్రామస్తులు డిప్యూటీ సీఎం నారాయణస్వామి విన్నవించారు. సమస్యను నెల రోజుల్లో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ధనుంజయవర్మ, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనరాజ్, గోవిందస్వామి, కుప్పిరెడ్డి, వీరస్వామి మందడి, రాజరాం మందడి, పురుషోత్తం రాజు, చందురాజు, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, శేషాద్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజు కుటుంబానికి పరామర్శ


గోవిందరాజులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం ఎంపీటీసీ గోవిందరాజు భార్య కస్తూరి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి తమ పార్టీ కార్యకర్తలతో కలసి ఆమె మృతదేహాన్ని పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. వినాయకపురం మండల మాజీ కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసియాదవ్, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచ్ అయ్యప్ప, మహేష్ బాబు, నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సుందరరాజు, చంద్రరాజు, రవి, గోపాల్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ


సుదర్శనవర్మ సతీమణిని పరామర్శిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురం గ్రామ మాజీ సర్పంచ్, విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.సుదర్శనవర్మ మృతి గ్రామానికి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్బీఆర్ పురంలో జరిగిన సుదర్శనవర్మ కర్మక్రియల్లో పాల్గొన్న రామ్‌ప్రసాద్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హిమాచలంబాబుకు నంది అవార్డు


అవార్డు అందుకుంటున్న హిమాచలంబాబు

పుత్తూరు రూరల్: తీర్థయాత్రా స్పెషల్ టూర్స్ నిర్వహణలో గత 25 ఏళ్లుగా విశేష సేవలందించినందుకు పుత్తూరుకు చెందిన సాయిరాం టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.హిమాచలంబాబుకు హైదరాబాద్‌కు చెందిన వల్లూరి ఫౌండేషన్ వారు బంగారు నంది అవార్డును ఇచ్చి సత్కరించారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ట్రావెల్స్, డాక్టర్స్, యాక్టర్స్, టీచర్స్, పూజారులకు వారి వారి రంగాల్లో విశేష సేవలందించిన వారికి అవార్డుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ హిమాచలంబాబు 1998 నుంచి గ్రామీణ ప్రజలకు ట్రావెల్స్‌లో విశేష సేవలందించినందుకు అవార్డు అందించినట్లు తెలిపారు.

ఉత్తమ టీచర్‌కు మిత్రుల సత్కారం


ఉపాధ్యాయురాలు సుజాతను సత్కరిస్తున్న బాల్యమిత్రులు

నగరి: వారంతా చదువులమ్మ ఒడిలో ఒక్కటిగా చదువుకున్నారు. ఉద్యోగాలు, వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తమ బాల్యమిత్రురాలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక కావడంతో వారు చాలా ఆనందపడ్డారు. ఆ ఆనందాన్ని తమ స్నేహితురాలితో పంచుకోవాలనుకున్నారు. ఆదివారం సెలవుకావడంతో తమ స్నేహితురాలిని కలిసి దుశ్శాలువలు, పూలదండలతో పాటు తాము చిన్నతనంలో కలిసి తీసుకున్న చిత్రపటాన్ని అందించి ఆప్యాయత అనురాగాలతో సత్కరించారు. ఈ సంఘటన నగరి పట్టణం గోల్డెన్ సిటీలో చోటుచేసుకుంది. మండలంలోని గుండ్రాజుకుప్పం మండలపరిషత్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న బి.సుజాత ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు పొందారు. ఈ వార్తను పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఆమె బాల్యమిత్రులు తెలుసుకున్నారు. దీంతో వారంతా వెళ్లి ఆమెను సత్కరించాలని నిర్ణయించుకుని ఆదివారం నగరి పట్టణంలోని ఆమె నివాసానికి చేరుకున్నారు. స్నేహితురాలిని సత్కరించి స్నేహమాధుర్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సుజాత మాట్లాడుతూ అవార్డుతో పాటు స్నేహితుల సత్కారం పొందడం చాలా గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో గణపతి, గోవింద్, వేలు, మహేశ్వరి, ప్రవీణ్, శాంతి, పుష్ప, జమునారాణి, తేజోవతి, మీనా, దేవి పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ షాప్ ప్రారంభం


ఎలక్ట్రికల్ షాప్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ్ ఎలక్ట్రికల్ షాప్‌ను ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు తక్కువ ధరకు అందుబాటులో ఎలక్ట్రికల్ వస్తువులు ఉండాలని, నాణ్యమైన వస్తువులను అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డిల్లయ్య, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిరెడ్డి, నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడు విజయాబాబు, నాయకులు కోటిరెడ్డి బాబు, మణి, మార్కొండయ్య, ఏసయ్య, డిసెంబర్ శెట్టి, మాధవయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి


నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం అలరించింది. మదనపల్లికి చెందిన శ్రీసూర్య డ్యాన్స్ అకాడమీ, నాట్య గురువు సూర్య ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ ఆకట్టుకుంది. కళాకారులు లిపికశ్రీ, వైష్ణవి, పల్లవి, భవ్యశ్రీ, ప్రజ్ఞ, ప్రణతి, యాశ్విత, హర్షిత, హిమాని, శ్రావణిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ఓంశక్తి ఆలయంలో మహాకుంభాభిషేకం



పుష్పాలంకరణలో అమ్మవారు, 1008 కలశాలతో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: మండల పరిధిలోని ఈడిగపల్లి గ్రామంలో నిర్మాణం చేపట్టిన ఓంశక్తి ఆలయంలో ఆదివారం వైభవంగా మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక హోమం, అలాగే 1008 కలశాలను ఏర్పాటు చేసి వివిధ యాగశాల పూజలు చేశారు. అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అర్చన, అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలు సుగంధ పుష్ప మాలికలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలో సుమారు 2000 మందికి అన్నదానం చేశారు. ఓంశక్తి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర హారతులు పట్టారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక వాహనపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన దాతలకు పట్టువస్త్రాలు అందించి గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఈడిగపల్లి గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న కోలాటం


స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కళాకారులు కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నారు. మహిళలు, పురుషులు, చిన్నపిల్లలు భజనలు చేసి భక్తిభావాన్ని చాటారు.
–బుచ్చినాయుడుకండ్రిగ

108 వాహనంలో ప్రసవం


శిశువుని వారి బంధువులకు అప్పగిస్తున్న 108 వాహన సిబ్బంది

గంగాధరనెల్లూరు: మండలంలోని పాచిగుంట గ్రామానికి చెందిన విద్య 108 వాహనంలో డెలివరీ అయింది. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు విద్యకు ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. 10 నిమిషాల్లో 108 వాహనం అక్కడికి చేరుకుని గర్భిణిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కాన్పు అయింది. ఆడ శిశువు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమమని 108 వైద్యాధికారి సందీప్ ,పైలట్ చిట్టిబాబు, సూపర్‌వైజర్ మోహన్ బాబు తెలిపారు. అనంతరం తల్లీబిడ్డను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు.